RNI No. APTEL 2022/82187
www.dishaenews.com
సమాజ దీక్ష
# దిశ
సాయంకాల దినపత్రిక

## అమరావతి పేరిట భారీ దోపిడీ!



- మాజీమంత్రి డా.సీదిరి అప్పలరాజు
- ఇతర ప్రాంతాల అభివృద్ధిని గాలికొదిలేశారు

(జయంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పేరిట భారీ దోపిడీ జరుగుతుందని మాజీమంత్రి, వైకాపా డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.సీదిరి అప్పలరాజు ఆరోపించారు. రూరల్ మండలం పెద్దపాడు వద్ద ఉన్న వైకాపా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణంలో - (మిగతా 4 లో)

## 22న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

(దిశన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘముల సమావేశాలు 2025 ఏప్రిల్ 22వ తేది మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీచేసారు. 2025, ఏప్రిల్ 22వ తేది మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గం.లకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10.30 గం.లకు 2,4,1,7 స్థాయి, మధ్యాహ్నం 3.00 గం.లకు 6వ స్థాయి, 4.00 గం. లకు 3వ స్థాయి, సాయంత్రం 5.00 గంటలకు 5వ స్థాయి సంఘాల సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ

అమరావతి: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం అనంతరం ఇందుకు సంబంధించిన గెజిట్‌ను న్యాయశాఖ జారీ చేసింది. ఈమేరకు న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి ఉత్తర్వులిచ్చారు. ఇటీవల ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

సంపుటి : 3 | సంచిక : 187 | తేది : 17.04.2025 గురువారం | ఎడిటర్ : అల్లు వెంకటరమణ | శ్రీకాకుళం | పేజీలు : 4 | వెల : 1/-

# పలాసలో భూ ఆక్రమణలపై ఇరు పార్టీలు ఫిర్యాదు


- ●ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఇదివరకే కమిటీ వేశారు
- ●ఆ కమిటీ తీసుకున్న చర్యలపై నీలి నీడలు?
- ●మీది పలాస.. మాది పలాసలా ఇక్కడ భూ ఆక్రమణలు తంతు
- ●భూ ఆక్రమణలపై అధికార, ప్రతిపక్షం సర్వే నెంబర్లుతో తహసీల్దార్‌కి వినతిపత్రాలు
- ●రెవిన్యూ అధికారులు న్యాయం ఎలా ఉంటుందో చూడాలి

(పలాస, దిశ న్యూస్)

జిల్లాలో ఎక్కడ లేని విధంగా పలాస మున్సిపాలిటీ, మండల పరిధిలో గల ప్రభుత్వ భూములు ఆక్రణలపై గత రెండు నెలలుగా పెద్ద భూ బాగోతము నడుస్తుంది. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కూటం ప్రభుత్వం పలాసకు సంబంధించి భూ ఆక్రమణలపై సమగ్ర సర్వే చేసి చర్యలు తీసుకోవాలని ఓ కమిటీని కూడా ఎమ్మెల్యే శిరీష ఆధ్వర్యంలో వేయడం జరిగింది.


అయితే ఆ కమిటీ సరిగ్గా పని చేయకపోవడం వలన ఇప్పుడు పలాస మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటూ అధికార, ప్రతిపక్ష పార్టీలు తహశీల్దార్ కార్యాలయం వేదికగా ఫిర్యాదులు పరం నడిపిస్తున్నారు. నిన్న తహసీల్దారుకు ఫిర్యాదు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు వైసీపీ నాయ కుల పై తీవ్రంగా మండిపడ్డారు. అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండ దండలతో మున్సిపాలిటీలో ప్రభుత్వ భూములు అనేకం ఆక్రమించుకున్నారు అన్న ఆరోపణలను చేస్తూ తెలుగుదేశం పార్టీ పలాస తహశీల్దార్ కు, మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. అయితే గురువారం ప్రతిపక్షానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. గతంలో తెలుగుదేశం పార్టీ భూ అక్రమణల పై చర్యలు తీసుకోవాలని గురువారం వైయస్సార్ పార్టీకి చెందినవారు సర్వే నెంబర్లు, ప్రాంతం, విస్తీర్ణం, గతంలో పెట్టిన హెచ్చరిక బోర్డులో సైతం ఫిర్యాదు చేశారు.





### టీడీపీ భూ ఆక్రమణల వివరాలిలా..

పలాస పరిధి పురుషోత్తపురం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 51 సుమారు నాలుగు ఎకరాలు భూమిని పట్టణ టిడిపి నాయకులు పద్మనాభపురం సర్వేనెంబర్ 395/1, 362/2B , 362/7A నంబర్లలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఉన్నారు. అలాగే కాశీబుగ్గ సర్వేనెంబర్ 234/1 తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి పురుషోత్తపురం సర్వేనెంబర్ 51 యొక్క ప్రభుత్వ భూమిని ఫ్లాట్లుగా మార్చి అమ్మేసి - (మిగతా 2 లో)



## పలాసలో భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి

- ◆ తహశీల్దార్‌కి వినతి అందించిన వైసిపి నాయకులు
- ◆ టీడీపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు చేపట్టండి
- ◆ పలాస భూ కబ్జాలపై టీడీపీ ఫిర్యాదు శుభ పరిణామం
- ◆ త్వరితగతిన దర్యాప్తు చేపట్టండి అంటున్న వైసీపీ నేతలు

(దిశ న్యూస్, పలాస)

పలాస అంటే భూ కబ్జాలకు పేరు అయ్యిందని తెలుగుదేశం నాయకులే భూ కబ్జాలపై ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు వేగవంతం చేయాలని పలాస తహశీల్దారు కళ్యాణ చక్రవర్తిని వైసిపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి తోపాటు పలువురు నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూ అక్రమణులు చేశారని బుధవారం పలాస తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారని, దీనిని మేము చాలా శుభ పరిణామంగా భావిస్తున్నామని తహశీల్దారుకి తెలిపారు. దీనికి కొనసాగింపుగా పట్టణ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరపున పట్టణంలో జరుగుతున్న టిడిపి నాయకుల భూ ఆక్రమణలను మీ ముందు ఉంచుతున్నామని, వీటిపైన సమగ్ర విచారణ జరిపి భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

### భూ ఆక్రమణల వివరాలిలా..

పలాస పరిధి పురుషోత్తపురం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 51 సుమారు నాలుగు ఎకరాలు భూమిని పట్టణ టిడిపి నాయకులు పద్మనాభపురం సర్వేనెంబర్ 395/1, 362/2B , 362/7A నంబర్లలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఉన్నారు.

అలాగే కాశీబుగ్గ సర్వేనెంబర్ 234/1 తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి పురుషోత్తపురం సర్వేనెంబర్ 51 లో ప్రభుత్వ భూమిని ఫ్లాట్లుగా మార్చి అమ్మేశారని చెప్పారు. పలాస పరిధి అనంతపురం గ్రామ పరిధి సర్వే నంబర్ 253 లో ఉన్న సుమారు 40 సెంట్లు శనీశ్వరుడు కొండ భాగాన్ని కిడ్నీ ఆసుపత్రి దగ్గర సత్యసాయి భవనంకు ఎదురుగా కొండ భాగాన్ని కంకర తవ్వి చదును చేసి టిడిపి నాయకుడు తన బంధువులు,మిత్రులు పేరున పక్కన నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని ఉన్నారు సదరు భూమి పైన సమగ్ర విచారణ జరిపి



తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పలాస పరిధి పద్మనాభపురం రెవిన్యూ సర్వేనెంబర్ 362/5 సూది కొండ నుండి పద్మనాభపురం సమీపం గుండా ఏఎంసి గోడౌన్ వెనుక భాగం నుండి పద్మనాభపురం తాళ్ళ చెరువుకు వెళ్లే వరద కాలువ సుమారు 2 ఎకరాల 31 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంతమంది టిడిపి నాయకులు ఆక్రమణ చేసి ఫ్లాట్లుగా మార్చి చాలామందికి అమ్మివేసి కోట్లాది రూపాయలు దండు కొన్నారు. ఇదివరకు నాటి టెక్కలి సబ్ కలెక్టర్ వికాస్ మర్మత్ స్వాధీనం చేసుకుని అది ప్రభుత్వ భూమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినను సదరు భూములో హెచ్చరిక బోర్డులను తొలగించి మరల వారి ఆధీనంలో ఉంచుకొని ఉన్నారు. సదరు భూమిపైన సమగ్ర విచారణ జరిపి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోపి, వైసిపి నాయకులు బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్, తూముల శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, దువ్వాడ రవి, కంచరాన భాస్కరరావు, తూముల.శ్రీనివాస్ గోండు మోహన్, గుజ్జు జోగారావు, వాయలపల్లి లక్ష్మణ్, బోనెల రవి, నర్తు వెంకటరమణ, నెయ్యల శివ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

(దిశన్యూస్, పలాస)

మే 10న జరగనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్డులో న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు, భార్య భర్తల కేసులు, వరకట్న నిషేధ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణ, ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.కేర్ పట్నాయక్, సెక్రటరీ కాళిదాసు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్ రాజు, లైబ్రరేరియన్ కోత రజనికుమార్, జి.ప్రభాకర్, రవి కుమార్, శ్యామ్, ఎక్సైజ్ సీఐ మల్లికార్జున్ రావు, కాశీబుగ్గ ఎస్సై మెట్ట చంద్రరావు, వజ్రపుకొత్తూరు ఏఎస్ఐ జిన్నారావు, కోర్ట్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్లోబల్ యంగ్ లీడర్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్

- ● వరల్డ్ ఎకనామిక్ ఫోరం జాబితాలో పేరు

(దిశన్యూస్, శ్రీకాకుళం)



వరల్డ్ ఎకనామిక్ గ్లోబల్ యంగ్ లీడర్ జాబితా-2025 లో రామ్మోహన్ నాయుడు పేరును వరల్డ్ ఎకనామిక్ ఫోరం చేర్చింది. ఈ గ్లోబల్ యంగ్ లీడర్ జాబితాలో టెక్ వ్యవస్థాపకుల నుంచి మానవ హక్కుల, న్యాయవాదుల నుంచి ప్రపంచవ్యాప్తంగా తమ రంగాలలో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నాయకులు ఉన్నారు. ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన యంగ్ గ్లోబల్ లీడర్ల జాబితాలో భారతదేశం నుంచి ఎంపిక చేసిన ఏడుగురిలో రామ్మోహన్ నాయుడు ఒకరు. యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పందిస్తూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా 'యంగ్ గ్లోబల్ లీడర్'గా ఎంపిక కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపు ఒక్క నాకు చెందినదే కాదు ముఖ్యమైన, ప్రభావితమైన నిర్ణయాలు తీసుకునే స్థానం లో భారత యువత ప్రాధాన్యం పెరుగుతుందని ఇది సూచిస్తోందన్నారు. నిజాయితీ, నూతన ఆలోచనలు, సమగ్రతతో ప్రజలకు సేవ చేయాలని ఈ గుర్తింపు మా బాధ్యతను మరింత గుర్తుచేస్తుందని అన్నారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

(దిశన్యూస్, గార)

మండలంలోని అంపోలులో ఉన్న జిల్లా జైలును సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఇప్పటివరకు ఎటువంటి న్యాయవాది లేనివారికి ప్రభుత్వ న్యాయవాదులు గురించి వివరిస్తూ బెయిల్ పిటిషన్లు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ముద్దాయిల ఆరోగ్య స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఆహారం పరిశీలించి, పరిసర ప్రాంతాలను సందర్శించి తగు సూచనలు అందజేశారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లాలో గల అన్ని న్యాయస్థానాలలో నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ గేదెల ఇందిరా ప్రసాద్, జైలర్ దివాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



**ఎడిటోరియల్**

# సమర్పించుకోవడమేనా..?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వత్తిడి పెరుగుతుంది. బీజేపీ ముందు మోకరిల్లడం మాని టీడీపీ బలం పెంచుకునే ప్రయత్నం చేయాలని సోషల్ మీడియాలో పెద్దయెత్తున కామెంట్స్ వినపడుతున్నాయి. వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యులు వరసగా రాజీనామాలు చేస్తూ ఉన్నారు. గత ప్రభుత్వ హయంలో టీడీపీకి రాజ్యసభలో చోటు లేకుండా పోయింది. పార్టీ ఆవిర్భవించిన తర్వాత రాజ్యసభలో అస్సలు ప్రాతినిధ్యం అనేది లేకపోవడం అప్పట్లోనే జరిగింది. అయితే 2024లో మంచి మెజారిటీతో విజయం సాధించిన తర్వాత ఇక వరసగా ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలన్నీ తమ ఖాతాలోనే పడతాయని టీడీపీ నేతలు భావించారు. ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇటీవల వైసీపీ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు పార్టీతో పాటు రాజ్యసభ స్థానాలకు రాజీనామా చేస్తే అందులో రెండింటిని మాత్రమే టీడీపీ తీసుకుంది. మోపిదేవి వెంకటరమణ, బీద రవిచంద్ర యాదవ్, ఆర్. కృష్ణయ్యలు రాజీనామా చేయడంతో ఆ ఖాళీల్లో ఆర్ కృష్ణయ్య తిరిగి బీజేపీలో చేరి రాజ్యసభ కు ఎంపికయ్యారు. టీడీపీకి రెండు స్థానాలు మాత్రమే దక్కాయి. తాజాగా విజయసాయిరెడ్డి కూడా రాజీనామా చేయడంతో ఈ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదలయింది. ఈ స్థానం తమకే వస్తుందని టీడీపీ నేతలు ఎప్పటి నుంచో ఆశలు పెంచుకున్నారు. కానీ చంద్రబాబు వైఖరిని చూస్తుంటే ఈ పదవి కూడా బీజేపీకి ఇచ్చే అవకాశాలున్నాయనిపిస్తుంది. ఇలా ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలను బీజేపీకి ఇచ్చుకుంటూ పోతే రాజ్యసభ లో టీడీపీ బలపడేది ఎట్లా? అని టీడీపీ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. త్యాగానికి అయినా ఒక అర్థం ఉండాలని, ఎమ్మెల్సీ నుంచి రాజ్యసభ స్థానం వరకూ అన్నీ కమలం పార్టీకి ఇచ్చి కూర్చుంటే పార్టీని ఇన్నేళ్లుగా నమ్ముకున్న తమ గతేంకానంటూ కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో ఇంత త్యాగం అవసరమా? అని కూడా కొందరు కార్యకర్తలు చంద్రబాబును నిల దీస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపితో టీడీపీకి ఎంత అవసర ముందో? అంతే అవసరం బీజేపీకి కూడా టీడీపీతో ఉందన్న విషయాన్ని మర్చిపోతే ఎలా అని అంటున్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల కోసం పార్టీ పదవులను త్యాగం చేయడం ఎంత వరకూ సబబని కార్యకర్తలు కూడా ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో అనేక మంది తమ సీట్లను త్యాగాలు చేసి టిక్కెట్లు దక్కకపోయినా పార్టీ కోసం పనిచేశారని, వారికి వచ్చిన అవకాశాన్ని ఇవ్వకుండా, బీజేపీకి సమర్పించుకోవడం ఏంటని కార్య కర్తలు నిలదీస్తున్నారు. ఇలాగే జరిగితే పదవులపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు డీలా పడతారంటున్నారు. సీనియర్ నేతలు ఎందరో పెద్దల సభకు వెళ్లాలని క్యూ లో ఉన్నప్పటికీ ఖాళీ అవుతున్న స్థానంలో తమకు దక్కేలా చేయకుండా రాష్ట్రాభివృద్ధి అంటూ పదే పదే పాట పాడుతూ పదవులను పణంగా పెట్టడమేంటని నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. మరి చంద్రబాబు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.



# దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతాం

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

(దిశ న్యూస్, పార్వతీపురం)

దళితుల, బహుజనుల అభ్యున్నతికి అహర్నిశలు కష్టపడతామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నారని, ప్రతి దళిత కులానికి సామాజిక న్యాయం జరుగుతుందని,అందుకోసం ముఖ్యమంత్రి ఎంతో శ్రమిస్తున్నారన్నారు.ఎన్డీఏ కూటమి వచ్చిన తర్వాత దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. గతంలో 59 దళిత కులాల్లో ఎస్సీ మాలా, మాదిగ ప్రధాన కులాలకు,తప్ప మిగతా ఏ దళిత ఉప కులానికి న్యాయం జరగలేదని, అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ జరిగిందన్న విషయం అందరికీ తెలిసిందేనని,ఇది ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ద్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎస్సీ ఏ,బి, సి, డి అనే గ్రూపులో ఉండేవి అని, ఇప్పుడు ఏ, బి, సి గ్రూపులుగా విభజించడం జరిగిందని, అందులో ఏ-గ్రూపులో మా సోదరులు రెల్లి కులస్తులను చేర్చడం జరిగిందని, బి గ్రూపులో మాదిగ సోదరులు తోపాటు వారి ఉపకులాలను చేర్చడం జరిగిందని, సి- గ్రూపులో మా సోదరులు మాల, వారి ఉపకులాలను చేర్చాన్నారు. ఇవన్నీ 2011వ సంవత్సరం జనాభా ప్రాతిపదికన విభజించామన్నారు. రెల్లి కులస్తులకు ఎంతో ప్రాధాన్యత కల్పించాలని ఉద్దేశంతో ఈ అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. రెల్లి కులస్తులకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమన్నారు.రెల్లి కుల సంక్షేమ సంఘం మన్యం జిల్లా నాయకులు పాలకొండ రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఎస్సీ-ఏ క్యాటగిరిలో రెల్లి కులస్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. రెల్లి కులస్తుల్లో కేవలం మహిళల్లో ఒకరికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం కాకుండా పురుషులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘం రాష్ట్ర నాయకురాలు జొన్నాడ శ్రీదేవి, దళిత కౌన్సిల్ సభ్యులు బొచ్చ ఆనందరావు, పొట్నూరు జయంతి, దివ్య, తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

# పలాసలో భూ ఆక్రమణలపై ఇరు పార్టీలు ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారని, పలాస పరిధి అనంతపురం గ్రామ పరిధి సర్వే నంబర్ 253 లో ఉన్న సుమారు 40 సెంట్లు శనీశ్వరుడు కొండ భాగాన్ని కిడ్నీ ఆసుపత్రి దగ్గర సత్యసాయి భవనంకు ఎదురుగా కొండ భాగాన్ని కంకర తవ్వి చదును చేసి టిడిపి నాయకుడు తన బంధువులు, మిత్రులు పేరున పక్క సర్వే నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని ఉన్నారని, సదరు భూమి పైన సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోగలరని ఫిర్యాదు చేశారు.

**ఇదంతా బాగానే ఉందని ప్రముఖ వైద్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు పరస్పర భూ ఆక్రమణల ఫిర్యాదులపై ఓ ప్రకటన విడుదల చేశారు.**

**ఆ ప్రకటన సారాంశం ఇలా ఉంది..**

అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి తమ వద్ద వున్న ఆధారాలతో నిన్న, ఈరోజు ఇరుపార్టీల నేతల పలాస తహశీల్దార్ వద్దకు వెళ్లి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండల పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై ఫిర్యాదు చేయడం జరిగిందని జీవితేశ్వరరావు తెలిపారు. ఆక్రమణలపై ఇరు పార్టీలకు చెందిన నాయకులు స్పష్టమైన సమాచారంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు ఇచ్చారు కనుక సంబంధిత రెవెన్యూ యంత్రాంగం తక్షణమే ప్రభుత్వ భూములు భూకబ్జాపై ఇరుపార్టీలు ఇచ్చిన ఫిర్యాదు అనుసరించి పలాస రెవెన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటే ప్రజల్లో ఎంతో పేరు తెచ్చుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి నిజానిజాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని నియోజకవర్గ ప్రజలు తరుపున కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

# నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

(దిశ న్యూస్, పార్వతీపురం)

నూతన పశు వైద్య భవన నిర్మాణానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్.మన్మధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువైద్య భవనముల మరమ్మతులు చేయించవలసి ఉన్నదని, వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పశు వైద్యశాలల నూతన భవన నిర్మాణానికి, ప్రతిపాదనలను సమర్పించడం జరిగిందని తెలిపారు.

# తాగునీటి కొరత తలెత్తకూడదు

(దిశ న్యూస్, పార్వతీపురం)



తాగునీటి కొరత ఎక్కడా తలెత్తకూడదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. తాగునీరు, ఇసుక,ప్రజల స్పందన ఎంఎస్ఎంఈ సర్వే, స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాగునీటి అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి ఉండాలన్నారు.

# మంచి జీవనశైలే ఆరోగ్యకర జీవితానికి నాంది




(దిశన్యూస్, మెరకముడిదాం)

మంచి జీవనశైలితో ఆరోగ్యవంతమైన జీవితానికి నాంది పలకవచ్చని ఐసిడిఎస్ పర్యవేక్షరాలు శ్రీదేవి అన్నారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో గల చెల్లాపురంలో గర్భిణీలకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ సర్పంచ్ రెడ్డివరం మాట్లాడుతూ ప్రభుత్వం మాతా శిశువుల సంరక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందని వీటిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. చిన్నారులకు వెయ్యి రోజుల సంరక్షణ అనే కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పలు సూచనలు సలహాలు చేస్తుందన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగపరచుకొని నిత్యం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకొని ఇంటి వద్ద కూడా సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటే చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేయవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ముత్యాల నాయుడు , సత్యనారాయణ, తల్లులు, గర్భిణీలు,.సెక్రటరీ జి సంతోష్ ఏఎన్ఎం వెంకటరమణమ్మ, ఆశ బి.శ్రీదేవి, అంగన్వాడీ టీచర్స్ కె.జయమ్మ, బి.ఆదిలక్ష్మి, బి.లక్ష్మి, డి.సింహాచలం, ఆయా కె.నాగమణి పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

(దిశన్యూస్, మెరకముడిదాం)



ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని, మీ పిల్లలను బడిలో చేర్పిం చాలని చినబంటుపల్లి ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం ఆల్తి రాంబాబు కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి వేతనదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నటువంటి సౌకర్యాలను తెలియజేశారు. మీ పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేయటం మా బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలతో పాటు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. నారాయణరావు, శ్రీదేవి, త్రివేణి పాల్గొన్నారు.

# కింజంగిలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ

(దిశన్యూస్, వంగర)



మండలంలో మరువాడ ప్రకృతి వ్యవసాయ యూనిట్ పరిధిలో గల కింజంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి ఎ.సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో పంచాయతీ సెక్రటరీ పి.సన్యాసినాయుడు పాల్గొని ఆయన మాట్లాడుతూ ఇప్పుడు వున్న పరిస్థితిలో వ్యవసాయం చేయడం రైతులకు బహు భారంగా వుందన్నారు. పెరుగుతున్న రసాయన ఎరువులు ధరలు అవి కూడా అవసరానికి అందుబాటులో లేకపోవడం రైతు పెట్టిన పెట్టుపడి కూడా రాని పరిస్థితిని రైతు ఎదుర్కొంటున్నారన్నారు. భవిష్యత్ లో వ్యవసాయం చేయటానికి రైతులుభయపడుతున్నారని ఇప్పటి పరిస్థితి లో ప్రకృతి వ్యవసాయం చెయ్యడం ఒక్కటే మార్గం అని ఆయన అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో దమ్ముకు ముందు నవద్యాన్యాలు భూమి లో వేసుకుని వరి పంట వేసుకుంటే భూమి సారాన్ని పెంచి ఎరువులు భారం తగ్గుతాయన్నారు. పిల్లలకి ఆరోగ్య కరమైన ఆహారాన్ని ఇవ్వడమే కాకుండా భూమిని కూడా సారవంతంగా తయారు చేసుకోవచ్చని ఆయన అన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో తయారు అయినా కషాయాలు సిబ్బంది సలహాతో తయారు చేసుకుని పంటను పండించు కోవాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బలిజిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని రైతులు ప్రతిఒక్కరూ ఒక అర ఎకరం భూమిలో ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు .అనంతరం గత సంవత్సరం నవధాన్యాలు వేసి మంచి దిగుబడి సాధించిన వేమిరెడ్డి సూర్యనారాయణ, వేమిరెడ్డి తిరుపతిరావులు తమ అనుభవాలు తెలియజేశారు. సూర్యనారాయణకి తిరుపతిరావులకు సెక్రటరీ, శ్రీనివాసరావులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. యూనిట్ ఇన్‌ఛార్జి సింహాద్రినాయుడు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏఎం, రమ్య , ఐసిఆర్‌పివి పోలినాయుడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఘన సత్కారం

(దిశన్యూస్, చీపురుపల్లి)

జడ్.పి.హెచ్.ఎస్ కాపుశంభం స్కూల్ కాంప్లెక్స్‌లో సుదీర్ఘకాలం కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేసిన ఏ.వి శ్రీనివాస్, పొట్నూరు నాగేశ్వరరావు, డి సతీష్ లను మండల విద్యాశాఖ అధికారులు ఏ.రామారావు, దువ్వాపు అప్పన్న స్కూల్ కాంప్లెక్స్ చైర్ పర్సన్ డి.రాము , సెక్రెటరీ ఎ .నిర్మల కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యారంగానికి వారు చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ కాంప్లెక్స్ లో రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరిస్తూ టీచర్లు అందర్నీ చైతన్యవంతులుగా చేసి, ప్రభుత్వ కార్యక్రమాలన్నీ చక్కగా ఉపాధ్యాయులకు అర్థమయ్యే విధంగా చెప్పారన్నారు. వీరు సేవలకు గుర్తింపుగానే కాంప్లెక్స్ లో ఉన్న ఉపాధ్యాయులందరూ ఈ సన్మానం చేస్తున్నట్టు చెప్పారు. సూరి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలో ఉన్న 16 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంతోనే ఎస్సీల అభివృద్ధి

## -ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదంపై హర్షం

(దిశన్యూస్, చీపురుపల్లి)



ఎస్సీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంలో సాధ్యమని సీఎం చంద్రబాబు మరోసారి రుజువు చేశారని చీపురుపల్లి కూటమి ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. చీపురుపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇదే విధానాన్ని డీఎస్సీలో అమలు చేయడం అభినందనీయమన్నారు. ఎస్సీలందరూ 15% రిజర్వేషన్ ను ఎస్సీ వర్గాలకు కూటమి ప్రభుత్వం అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కూటమి ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదం తెలపడం దళితుల ఉప కులాలలో విద్య, ఉపాధి పొందడంలో మరొక మైలురాయిగా జీవితాంతం గుర్తు ఉంటుందన్నారు. దళితులపై ఉన్న చిత్తశుద్ధిని మరోసారి కూటమి ప్రభుత్వం తెలియజేసిందన్నారు. 30 ఏళ్ల నాటికల ఎస్సీ వర్గీకరణ గతంలో 1997 సంవత్సరంలో కూడా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వర్గీకరణ చేసి ఎస్సీ ఉపకులాలలో ఎంతోమంది జీవితాలలో వెలుగులను నింపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**- జిల్లాలో అదుపు తప్పిన అడ్మినిస్ట్రేషన్**

**- రైలు ఏ టైమ్ కి వస్తే అదే కార్యాలయ టైమ్**

(దిశ న్యూస్, పార్వతీపురం)

పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న అధిక శాతం ఉద్యోగుల సమయపాలనంత రైలు బండి దయ మీదే ఆధారపడి ఉందని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓ బి సి పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, ఓబీసీ నియోజకవర్గ చైర్మన్ సిరిసిపెల్లి సాయి శ్రీనివాస్, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు గురువారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు పార్వతీపురం పట్టణంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మండల కార్యాలయాలు, వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు సముదాయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. తమ పరిశీలనలో రెండు మూడు కార్యాలయాల్లో జిల్లా స్థాయి అధికారులు 11 గంటలలోపు కార్యాలయానికి రావడం జరిగిందన్నారు. మిగతా కార్యాలయాల్లో దాదాపు జిల్లా స్థాయి అధికారులు రాలేదు అన్నారు. కొన్ని కార్యాలయాల్లో ఇద్దరు ముగ్గురు దిగు స్థాయి సిబ్బంది హాజరు కాగా, రెండు కార్యాలయాల్లో 80 శాతం వరకు సిబ్బంది హాజరయ్యారు అన్నారు. కొన్ని కార్యాలయాలు తలుపులు తెరుచుకోలేదన్నారు. దీనికి అంతటికీ కారణం పార్వతీపురం మన్యం జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ అదుపు తప్పిందని ఆరోపించారు. పాలనపై అవగాహన లేని పాలకులు, ఉన్నతాధికారుల అసమర్థత వలన ఈ పరిస్థితి నెలకొందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉద్యోగుల్లో సుమారుగా 70 శాతం మంది విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాల నుండి పార్వతీపురం జిల్లాకు రాకపోకలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారి రాకపోకలంతా కార్యాలయ సమయాలు అంతా రైలు బండి దయపైన ఆధారపడి ఉంటుందన్నారు. కొంతమంది ఉద్యోగులు విశాఖపట్నం కొరాపుట్ ప్యాసింజర్, కొంతమంది గుంటూరు రాయగడ, కొంతమంది సమతా రైళ్లకు వస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ రైలు బళ్ళు వచ్చిన సమయానికే కార్యాలయాలకు వస్తున్నట్లు తెలిసిందన్నారు. రైలు దిగేసరికి పార్వతీపురం రైల్వే స్టేషన్ కి ఆయా ఉద్యోగుల కోసం సిబ్బంది ప్రభుత్వ వాహనాలతో సిద్ధంగా ఉండి కార్యాలయాలకు తీసుకు వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పార్వతీపురం పట్టణంతోపాటు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, గరుగుబిల్లి తదితర మండలాల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగులు కూడా అదే రైలుకు వచ్చి దూరంగా ఉన్న ఆయా మండల కార్యాలయాలకు వెళుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక వారు ఏ సమయానికి కార్యాలయానికి వెళతారో వారికే ఎరుక అన్నారు. సాయంత్రం రైలు టైం చూసుకుని కార్యాలయ సమయంతో సంబంధం లేకుండా కొంతమంది ఉద్యోగులు ముందుగానే ఇళ్లకు వెళుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాయపూర్ - విశాఖపట్నం, రాయగడ- గుంటూరు తదితర రైళ్ళను ఆశ్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. అధిక శాతం ప్రభుత్వ ఉద్యోగుల్లో సమయపాలన లేకపోతే జిల్లా అభివృద్ధి పథంలో ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా, జిల్లాలోని మండల కేంద్రాల్లో ఉన్న కార్యాలయాలు, వార్డు, గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం తమ పార్టీ ఇంచార్జ్ బత్తిన మోహన్ రావు ఆదేశాల మేరకు నిర్వహించారు.



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

(దిశన్యూస్, ఎచ్చెర్ల)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈవోలు కె. పున్నయ్య, జి.రాజ్ కిశోర్ లు తెలిపారు. మండలం ముద్దాడపేట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్ ఆధారిత విద్యను కూడా అమలుచేస్తున్నట్టు చెప్పారు. నాణ్యమైన విద్యతో పాటు ఏక రూపదుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం తదితర వాటిని కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంతలకోడూరు ఉన్నత పాఠశాల హెచ్ ఎం ఆనందరావు, స్థానిక పాఠశాల హెచ్ఎం బొడ్డేపల్లి విజయమ్మ, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కోమలి, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయ పబ్బం గడుపుకోవడానికే వైసిపి డ్రామాలు

**● టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున**

(దిశన్యూస్, విజయనగరం)

మతాలు, కులాలు, వర్గాలను నడిగొట్టే మనస్తత్వం వైసీపీ పార్టీ దేనని విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ 2019లో ఎలా విద్వేషాలు రెచ్చగొట్టి వైసిపి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం లోకి వచ్చాక ఏ వర్గానికి మేలు చేయకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేసినా, అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి నేపథ్యంలో మతాలు మధ్య విధ్వంసం సృష్టించాలని వైసిపి ప్రయత్నించిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పై మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు. తిరుమల దేవస్థానంపై, పాలకవర్గంపై బురదజల్లి హిందువుల మనోభావాలను దెబ్బతీయాలని వైసీపీ చూస్తుందన్నారు. ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలు అన్ని మతాల మనోభావాలను జాగ్రత్తగా చూసుకుంటుందన్నారు. వైసీపీకి హిందూ మతం అంటే గౌరవం ఉందా అని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారి భార్య అన్నా లేజీనోవా గారు తిరుపతి వెళ్తే దాన్ని వైసిపి రాద్ధాంతం చేస్తుందన్నారు. రష్యా నుంచి వచ్చిన ఆమె డిక్లరేషన్ పై సంతకం చేసి, తలనీలాలు సమర్పించి అన్నదానం చేశారన్నారు. మీకు ఐదేళ్లలో మీ కుటుంబ సభ్యులు ఎవరైనా డిక్లరేషన్ పై సంతకం చేశారా అని ప్రశ్నించారు. భూమన కరుణాకర్ రెడ్డి రెండుసార్లు టీటీడీ చైర్మన్ చేశారని ఆయనెప్పుడైనా డిక్లరేషన్‌పై సంతకం చేశారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కరుణాకర్ రెడ్డి తప్ప ఇంకా ఎవరైనా హిందువులు చైర్మన్‌గా నియమించడానికి దొరకలేదా అని ప్రశ్నించారు. హిందువులకు దైవంతో సమానమైన గోశాలపై భూమాన పెద్ద రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో తిరుమలలో దర్శన టికెట్లను బుకింగ్ ఓపెన్ కాగానే దళారులు బుక్ చేసి అధిక ధరలకు అమ్మేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 30 వేల మంది దళారేలను బ్లాక్ లో పెట్టింది వాస్తవం కాదా..... తిరుమలలో భక్తులందరికీ ఉన్నతమైన సేవలు అందుతున్నాయి అన్న విషయం వాస్తవం కాదా.... చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని దేవాలయాలన్నింటిని సాంప్రదాయబద్ధంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. కరుణాకర్ రెడ్డి గోశాలకు వెళ్లి ఆయనకున్న సమస్యలను నివృత్తి చేసుకోవాలని, లేని పోని ప్రకటనలు చేస్తూ రాద్ధాంతం సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కర్రోతు నరసింగారావు, అకిరి ప్రసాదరావు, అల్తి బంగారు బాబు, కలిదిండి పాణిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రా ఆణిముత్యం "తనూజ"

**- గ్రామీణ ప్రాంత విద్యార్థినికి రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంక్**

**- గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తెచ్చిన గర్భాం ఆదర్శ కళాశాల విద్యార్థిని**

(దిశ న్యూస్, మెరకముడిదాం)

రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడంతో ఒక్కసారి ఉబ్బి తబ్బిబ్బయింది. పుత్రికోత్సాహంతో ఆమె తల్లిదండ్రులకు మాటలు రాలేదు. జన్మించిన గర్భాం గ్రామం పులకరించిపోయింది. గ్రామమంతా ఆనంద డోలికలతో మునిగి తేలియాడారు. తమ గ్రామానికి చెందిన విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అయింది. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వివరాల్లోనికి వెళ్ళగా మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి తనూజ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో రాష్ట్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. 1000 మార్కులకు గాను బైపీసీ విభాగంలో 987 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ చేజిక్కించుకుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఇటీవల రాష్ట్ర స్థాయి ర్యాంకర్లతో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్- ట్రైనింగ్ స్టార్ 2025 కార్యక్రమంలో సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ తో ఇంగ్లీషులో ముఖాముఖి స్పీచ్ ఇచ్చి అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. దీంతో తనూజ స్వగ్రామంలో, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో తనూజను పొగడ్తల వర్షంలో ముంచెత్తారు. ఏది ఏమైనప్పటికీ ఓ గ్రామీణ ప్రాంతంలో చదువుకున్న విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం అందరికీ గర్వకారణమని చెప్పకనే చెప్పవచ్చు.

### తనూజ తల్లిదండ్రుల నేపథ్యం..

ఈమె తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తండ్రి సూర్యనారాయణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ పోషణ సాగించడం జరుగుతుంది. తల్లి ఆదిలక్ష్మి గృహిణి. వ్యవసాయ కుటుంబం కావడంతో పాటు వ్యవసాయ భూమి కూడా ఎక్కువ లేకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు.

### విద్యాభ్యాసం సాగింది ఇలా..

తన స్వగ్రామమైన గర్భాం గ్రామంలో ఉన్న శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎల్కేజీ నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యను అభ్యసించింది. అప్పట్లో ఆరవ తరగతి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలో 440 మార్కులకు గాను బైపీసీ విభాగంలో 437 మార్కులు సాధించి తన సత్తా చాటింది. ఇటీవల



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాల్లో 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలోనే ప్రథమ ర్యాంకుగా నిలిచి తన సత్తా రాష్ట్రవ్యాప్తంగా చాటింది. రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకోవడంతో గోల్డ్ మెడల్ సాధించడంతోపాటు, సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్, ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

**తమ కుమార్తెకు రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం, ఇంత పేరు రావడం చాలా ఆనందంగా ఉంది**

**- తల్లిదండ్రులు సూర్యనారాయణ, ఆదిలక్ష్మి**

**రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు రావడం.. అది మా కళాశాల పేరు రాష్ట్రంలో వినిపించడం చాలా సంతోషం.**

**- డివిఎస్ అరుణ కుమారి, ప్రిన్సిపాల్**

**తనూజ చిన్ననాటి నుండి పట్టుదల ఉన్న విద్యార్థిని. ఆరవ తరగతి ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలో అప్పట్లో మా పాఠశాల నుండి పరీక్షరాసి మండల స్థాయిలో ప్రథమస్థాయిలో నిలిచి మా పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చింది.**

**- విజినిగిరి శంకర్, కరస్పాండెంట్,**
**శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్, గర్భాం**

# ఆర్టీసీ డిఎం మొండి వైఖరి విడనాడాలి

**- కార్మికులపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి**

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు**

(దిశ న్యూస్ పార్వతీపురం)

పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ తీరు మారాలని, కార్మికుల పట్ల కక్షపూరితమైన చర్యలు విడనాడాలని సిఐటియు, వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో ఎ.ఏస్.టి.బాబు పై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ పార్వతీపురం ఎస్.డబ్ల్యూ.ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిహెచ్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఎన్.వి.పి.రావు, ఎస్.డబ్ల్యూ.ఎఫ్ విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకట్రావు, చంద్రయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్కు విరుద్ధంగా సస్పెండ్, ట్రాన్స్ఫర్లు చేస్తున్నారని ఇది చాలా అక్రమమైన చర్యని అన్నారు. ఏ.ఎస్.టి.బాబు గతం నుండి డిపోలో జరుగుతున్న అనేక అక్రమ పనులకు అడ్డుపడుతూ, ప్రతి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నడంతో ఓడి కండక్టర్ జె.ఎం.రావుతో తప్పుడు ఫిర్యాదు రాయించుకొని దాని ఆధారంగా, ఏ.ఎస్.టి.బాబును సస్పెండ్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఈ అన్యాయమైన చర్యని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఎస్.డబ్ల్యూ.ఎఫ్ యూనియన్ పట్ల డిపో మేనేజర్ కక్షపూరితమైన చర్య చేపట్టియున్నారని, దీన్ని మానుకోవాలని సూచించారు. కార్మికులు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే క్రమ పద్ధతిలో చర్యలు తీసుకోవాలని, అటువంటి చర్యలు



చేపట్టక ఏ.ఎస్.టి.బాబు పై సస్పెన్షన్ విధించడమంటే, ఇది కేవలం కుట్రపూరిత చర్యనని, సస్పెన్షన్ రద్దు చేసి విధుల్లో తీసుకున్నంత వరకు ఉద్యమం కొనసాగించాలని, ఈ పోరాటం లో సిఐటియు వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్.డబ్ల్యూ.ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఎన్.వి. పరమేశ్వరరావు మాట్లాడుతూ పార్వతీపురం డిపో కార్మిక ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో కృషి చేస్తున్న ఎస్.డబ్ల్యూ.ఎఫ్ కార్యదర్శి ఎ.ఎస్.టి.బాబు పై డిపో మేనేజర్ వ్యవహరిస్తున్న వైఖరి సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పార్వతీపురం డిపోలో గతం వరకు 12 మంది కండక్టర్లను, డ్రైవర్లను డిపో యాజమన్యం సస్పెండ్ చేయడం జరిగిందని, ఇది చాలా అన్యాయమని అన్నారు. ఎం.టి.డబ్ల్యూ చట్టప్రకారం సిబ్బంది డ్యూటీ బుకింగ్ చార్టు 281 కార్మికులకు అందుబాటులో లేకపోవడాన్ని ఏ.ఎస్.పి.బాబు నిరంతరం ప్రశ్నిస్తుండడంతో, ఒక రోజు ఇరువురి కార్మికుల మధ్య ఏర్పడిన చిన్నపాటి ఘర్షణను ఆసరాగా తీసుకొని ఎటువంటి సమన్వయం,కనీస ప్రమాణాలు పాటించకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్యని,వెంటనే సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని తెలిపారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్ మాట్లాడుతూ అక్రమంగా చేపట్టిన సస్పెన్షన్ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లె నిద్ర

(దిశన్యూస్, శ్రీకాకుళం)

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరం లోని సీపన్నాయుడులోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. అనంతరం గురువారం ఉదయం అక్కడే కాలకృత్యాలు తీర్చుకొని అనంతరం సీపన్నాయు డుపేట, ఫాజుల్‌బాగ్‌పేట ప్రాంతాల్లోని అన్ని వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించారు. సీపన్నాయుడుపేటలోని మురికి నీటి సమస్య ప్రధానంగా ఉందని, సమస్యను పరిష్కరిం చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా అన్ని వీధుల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తాగునీటి పైపులు లేకపోవడంతో వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను కూడా పరిష్క రించే దిశగా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. అలాగే ప్రజల నుంచి భూసమస్యలు, విద్యుత్, కాలువలు, డ్రైన్లు, రోడ్లు వంటి వాటిపై ఫిర్యాదులు అందా యని ఎమ్మెల్యే చెప్పారు. వీటికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, తహశీల్దార్ గణపతి, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, సీపాన రమేష్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




## ఇంటింటికీ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలి

### కమిషనర్ రామారావు

(దిశన్యూస్, పలాస)

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఏర్పడిన మంచినీటి ఎద్దడి తీవ్రత దృష్ట్యా పురపాలక సంఘంలో ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్‌తో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా పంపిణీ జరుగుతున్న మంచినీరు ప్రతి ఒక్క ఇంటికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు, పొరపాట్లు జరిగినా సహించేది లేదని పేర్కొన్నారు. ట్యాంకర్ ద్వారా నీటిని ఇచ్చే సమయాన్ని ప్రతి ఉద్యోగి కూడా ఖచ్చితంగా పాటించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మంచినీటి సరఫరా కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృంద పర్యవేక్షణ అధికారులు, లైజరింగ్ అధికారులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్లు, మంచినీటి సరఫరా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఏపిజిఎల్ఐ ఫైళ్లను ఇకపై ఆన్‌లైన్‌లోనే పంపాలి

(దిశన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ ఉద్యోగుల ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా (ఏపి.జి.ఎల్.ఐ)కి సంబంధించి పాత ఫైళ్లను ఇకపై ఆఫ్లైన్‌లో పంపించవద్దని, తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా పంపాలంటూ సహాయసంచాలకులు ఎస్. సతీష్ కుమార్ సూచించారు. మే 2024 నుండి https://nidhi.apcfss.in అనే వెబ్‌సైట్‌లోని నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ఫైళ్లను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. జీవిత బీమా ఫైళ్ల వివరాలు, నిర్బంధ బీమా ప్రీమియం, వాలంటరీ ప్రీమియం పెంపు , ఋణ ములు , క్లైములు , నామినేషన్ సవరణలు వంటి డేటాను ఉద్యోగులు తమ యూజర్ లాగిన్ ద్వారా నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత డీడీవోకు పంపించాలని తెలిపారు. 2024 ఫిబ్రవరి 16న ప్రభుత్వం జారీ చేసిన జివో నం.19 ప్రకారం ఈ మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయి. డీడీవోలు తమ యూజర్ ఐడీ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసి, ప్రాసెస్ చేసి, ఎన్హాన్స్‌మెంట్ ట్రైల్‌ను జెనరేట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాత విధానంలో మానవీయంగా ఫైళ్లను పంపే విధానాన్ని ఇకపై అంగీకరించబోమని తెలిపారు. ఏపి.జి. ఎల్.ఐకి సంబంధించిన అన్ని ప్రక్రియలు ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరగాలన్నారు.

# టీటీడీ గోశాల ఆవుల మృతిపై విచారణ జరపాలి

- గోమాతల దుస్థితి భక్తుల హృదయాలను కలచివేస్తుంది
- వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన టీటీడీ మాజీ చైర్మన్‌పై కూటమి ప్రభుత్వం బెదిరింపులు తగదు
- వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు

(దిశ న్యూస్ పలాస)

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక ధామమైన తిరుపతిలోని టీటీడీ గోశాలలో ఇటీవల అకాలంగా మరణించిన గోవుల మృతి వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ చేపట్టాలని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు కోరారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కలియుగ వైకుంఠనాథుని సన్నిధిలోని టీటీడీ గోశాలలో పూజలు అందుకుంటున్న గోవులు మృత్యువాత పడడం భక్తులకు ఆవేదనకు గురి చేస్తుందని, పరమ పవిత్రంగా పూజించే గోమాతల దుస్థితి, మృత్యు ఘోషతో హృదయాలను కలచి వేస్తుందన్నారు. పదుల సంఖ్యలో గోవులు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తున్న అంశం అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పై కూటమి ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు తెగ బడటం దురదృష్టకరమన్నారు. గోశాలలో గోవుల మృతి నిజమేనని ప్రస్తుత టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు 20 నుంచి 22 దాకా గోవులు మృతి చెంది ఉంటాయని చెబుతుంటే, ఎమ్మెల్యే ఆరణి మాత్రం 40 దాకా మృత్యువాత పడి ఉంటాయని చెబుతున్నారని, ఈ ఘటనపై టిటిడిలో ఒక ఏకాభిప్రాయం లేదని అర్థమవుతుందని దుర్యోధన రావు పేర్కొన్నారు. గోశాలలో ఆవులు మృత్యువాత పడిన అంశాన్ని వెలుగులోకి తెచ్చిన కరుణాకర్ రెడ్డి పై కూటమి ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. హైందవ ధర్మ పరిరక్షణకు టిటిడి చైర్మన్ గా గతంలో భూమన కరుణాకర్ రెడ్డి చేసిన సేవలు అద్వితీయమని బమ్మిడి దుర్యోధనరావు చెప్పారు. హాయ్ దివసంస్కృతి, సనాతన ధర్మం గురించి కరుణాకర్ రెడ్డికి తెలుసునన్నారు. ఆయన చైర్మన్ గా ఉన్న హయాంలో ప్రధానంగా దళిత గోవిందం, మత్స్యగోవిందం, కళ్యాణమస్తు, గోవింద కోటి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజల ముందుకు తెచ్చారని బమ్మిడి గుర్తు చేశారు.




ఏడుకొండలవాడు చెంతకు రాలేని వారందరి కోసం సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడినే దళిత వాడలకు తీసుకువెళ్లి పూజలు చేయించిన గొప్ప మనిషి భూమన అని తెలిపారు. మత్స్యకారులకు వేద కర్మల్లో శిక్షణ ఇప్పించి, సర్వ మానవ సమానత్వాన్ని చాటారన్నారు. కళ్యాణ మస్తు ద్వారా బంగారపు తాళిబొట్టు, వెండి మెట్టెలు, వధూవరులకునూతన వస్త్రాలు, తలంబ్రాలు, పెళ్లి సామాగ్రి, మంగళ వాయిద్యాలు, ధార్మిక స్తోత్ర పుస్తకాలు, పురోహితుడు, 60 మంది బంధుమిత్రులకు పెళ్లి భోజనాలు ఉచితంగా కల్పించాలని వివరించారు. గోవింద కోటి ద్వారా భక్తులకు విఐపి బ్రేక్ దర్శనం కల్పించి ప్రజల్లో భక్తితత్వాన్ని పెంపొందించారని వెల్లడించారు. శ్రీవారి సేవలో నిత్యం తలమునకలైన టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని అమలు చేసి తన శక్తి సామర్థ్యాలు భూమన కరుణాకర్ రెడ్డి నిరూపించుకున్నారన్నారు. వైయస్సార్ మరియు వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టిటిడి బోర్డు చైర్మన్ గా వ్యవహరిస్తూ తిరుమల ఆలయ ప్రతిష్టను పెంచేలా గొప్ప సంస్కరణలను తీసుకొని వచ్చారని, అటువంటి వ్యక్తిపై కూటమి ప్రభుత్వం పెద్దలు గోశాలలో గోవులు మృతి చెందడాన్ని ప్రశ్నిస్తే బెదిరించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వాస్తవాలు తెలుసుకొని తిరుమల పవిత్రతను కాపాడే క్రమంలో గోశాలలో ఆవుల మృతిపై తక్షణం విచారణ చేపట్టాలని బమ్మిడి దుర్యోధనరావు డిమాండ్ చేశారు.

# అమరావతి పేరిట భారీ దోపిడీ!

(మొదటిపేజీ తరువాయి)

విచ్చలవిడిగా అవినీతి జరుగుతుందని, దీంతో రాజధాని రైతులకూ అన్యాయమే, రాష్ట్రానికీ అన్యాయమేనని విమర్శించారు. తమ జేబులు నింపుకోవడంకోసం విపరీతంగా అంచనాలు పెంచి టెండర్లు ఖరారుచేశారన్నారు. కావాల్సిన కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. దేశంలో ఇంతటి అవినీతి ఎక్కడా చూడలేదన్నారు. గతంలో రూ.2,700 కోట్లయ్యే సచివాలయానికి ఇప్పుడు రూ.4,700 కోట్లా.. నాడు అమరావతి పూర్తి స్థాయి పనులకు రూ.44వేల కోట్ల అంచనాలు, నేడు రూ.77వేల కోట్లా.. 75శాతం అంచనాలు పెంపు ఎక్కడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఇలాంటి దోపిడీని ఎక్కడైనా విన్నామా? చూశామా? అని అన్నారు. దోపిడీ కోసమే జ్యుడిషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ రద్దు చేశారని దుయ్యబట్టారు. మొబలైజేషన్ అడ్వాన్స్ పేరిట ముందస్తు దోపిడీ జరుగుతుందని, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను గాలికొదిలేసి కమీషన్ల వేటలో పడ్డారన్నారు. ప్రజలను మళ్లీ కష్టాల్లోకి నెట్టారని, ప్రభుత్వ పెద్దలు మాత్రం జల్సాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అన్ని రంగాలకు అవసరమైన రీతిలో సమ్మిళిత అభివృద్ధి జరగాల్సింది పోయి కేవలం అమరావతిని కేంద్రీకృతం చేస్తూ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసుకునే పరిస్థితి చంద్ర బాబు ప్రభుత్వంలో జరుగుతోందన్నారు.


అన్ని రంగాలు, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పది నెలల బాబు పాలనలో ఇంత దారుణంగా ఉన్నా మేధావులు సైతం నోరుమెదపకపోవడం విచారకరమన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమ లు చేయకుండా ఆర్థిక పరిస్థితి పేరిట ప్రజల దృష్టి మళ్లించేందుకు రాష్ట్రాభివృద్ధి అమరావతే అని భ్రమలు కల్పించేందుకు తాపత్రయపడుతున్నారని ఆయన ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతి, స్థానిక సంస్థల బలోపేతం అన్ని రంగాల అభివృద్ధికి జగన్ ఐదేళ్లలో ఎంత చేశారో ప్రజలకు తెలుసునన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించుకోవడం మానుకోవాలని, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సీదిరి పేర్కొన్నారు.

# రోడ్డు డెలివరీయేనా.. డోర్ డెలివరీ లేదా..?

- నిబంధనలు పాటించని గ్యాస్ ఏజెన్సీలు?
- అదనపు వసూళ్లుతో ఇక్కట్లు పడుతున్న వినియోగదారులు

(దిశన్యూస్, పలాస)



ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా ఉద్దానంలో డెలివరీ సరఫరాలో గ్యాస్ ఏజెన్సీలు అక్రమ పద్ధతిలో వినియోగదారులను మోసం చేస్తున్నారని గ్యాస్ వినియోగ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల నుండి అడ్డ గోలుగా వసూలు చేస్తున్న ఏజెన్సీలు తీరుపై ఇక్కడ వినియోగ దారులు మండి పడుతున్నారు. ముఖ్యంగా డోర్ డెలివరీ ఇవ్వ కుండా రోడ్డు వద్ద డెలివరీ ఇస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నా రని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వారికి నచ్చిన విధంగా నడుస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వంటగ్యాస్ ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నా కొన్ని గ్యాస్ ఏజెన్సీలు ప్రజలపై బరువు మోపుతున్న తీరుకు అడ్డుకట్ట పడటం లేదు. గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా డెలివరీ బాయ్స్ ద్వారా ప్రతి సిలిండర్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ డెలివరీ కిలోమీటర్లు పరిధిని బట్టి సరపరా జరగాలి. అయితే వాస్తవ పరిస్థితికి పూర్తి భిన్నంగా ఉంది. పట్టణాల్లో, మండలాల్లో సిలిండర్ ధర ఇన్వాయిస్ ప్రకారం చెల్లించి బిల్లు ఇవ్వాల్సింది పోయి వినియోగదారుల నుండి అడ్డగోలుగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వేల మంది వినియోగదారులు ఉండటంతో, ఈ లెక్కన ఏటా లక్షల రూపాయలు గ్యాస్ వినియోగదారుల నుంచి దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వాస్తవం వెలుగులోకి వస్తోంది. గ్యాస్ ఏజెన్సీల అడ్డగోలు దోపిడీతో వినియోగదారులు అసహన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్యాస్ ఏజెన్సీలపై తనిఖీలు నిర్వహించి అక్రమ దోపిడీలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

వినియోగదారులు ఆవేదన..

డెలివరీ బాయ్ అడిగినంత చెల్లించకపోతే సిలిండర్ ఇంటికే రాదు అంటున్నారు స్థానికులు. కానీ డెలివరీ బాయ్స్ వసూలు మాత్రం తప్పనిసరి అయ్యింది అంటూ వాపోతున్నారు.

ఇవీ డెలివరీ బాయ్స్ పాటించాల్సిన నియమాలు

- సిలిండర్ సీల్ చెక్ చేయాలి
- నిర్దేశించిన బరువు ఉందో లేదో నిర్ధారించాలి
- ఓరింగ్ సరిగా ఉందా పరిశీలించాలి
- గ్యాస్ లీకేజ్ చెక్ చేసేందుకు పరికరాలు ఉండాలి

ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, డెలివరీ ఛార్జీల పేరుతో సాగుతున్న దోపిడీకి బ్రేక్ వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నియమాలు ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఖరీఫ్‌కు సాగునీరు అందించాలి

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్

(దిశన్యూస్, ఎచ్చెర్ల)

వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో తోటపల్లి నారాయణపురం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయ్ ఖరీఫ్ సీజన్‌కు నీరు అందించాలనీ, అందుకు అవసరమైన చర్యల కోసం జిల్లా కలెక్టర్‌ని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇది వరకే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుని కలిసి



విన్నవించామని చెప్పారు. శనివారం నారాయణపురం కాలువకు సంబంధించిన ఫీల్డ్ విజిట్ ను రైతులు, అధికారుల తో కలిసి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో దిగజారుతున్న విద్యావ్యవస్థ

### - యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి




(దిశ న్యూస్ పలాస)

ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటం చేయడమే కాకుండా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాటం చేస్తూ బాధ్యతల కోసం కూడా పనిచేస్తున్న సంఘం యూటిఎఫ్ అని జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండల ఉపాధ్యాయులు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్నటువంటి అనాలోచిత నిర్ణయాలు వల్ల నానాటికి విద్యావ్యవస్థ దిగజారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కరోనా సమయములో నాలుగు లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరితే నేడు 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలను విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలని జిల్లా అధ్యక్షులు లండ బాబురావు అన్నారు. ఒకే మీడియం పాఠశాలలను నిర్వహించడం, 3,4,5 తరగతులు హైస్కూల్ లో కలపడం.. నేటి ప్రభుత్వం పరిసర ప్రాంత పాఠశాలలను విలీనం చెయ్యడం,ఇవన్నీ కూడా పాఠశాల మూత వేయడానికి ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు.

కాబట్టి ప్రభుత్వం వెంటనే విద్యారంగంపై ప్రయోగాలు చేయవద్దని ప్రతి గ్రామంలో కూడా ఒకటి నుంచి ఐదు వరకు ప్రాథమిక పాఠశాల ఉండాలని, యూపీ స్కూల్లు కొనసాగించడం,హైస్కూల్ 6 నుంచి పది వరకు నడపాలని, రెండు మీడియంలో కూడా పాఠశాలలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గున్న రమేష్ అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వి చలం పలాస అధ్యక్షుడు తమ్మినాన జయరాం ప్రధాన కార్యదర్శి సిద్దు డీ.జనార్ధనరావు, పీ.సంజయ్ కుమార్, టీ.అప్పారావు, పలాస, వజ్రపుకొత్తూరు మందస యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

## ఈవీఎం గోదాముల తనిఖీ

(దిశన్యూస్, శ్రీకాకుళం)

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై మాసాంతపు తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు (ఉప ముఖ్య కార్యనిర్వాహక అధికారి, ప్రభుత్వ ఉప కార్యదర్శి) పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములో అమలులో ఉన్న ట్రిపుల్ లాక్ విధానం, 24 గంటల సీసీటీవీ పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలను, సిబ్బంది విధులు, హాజరును ఆయన సమీక్షించారు. ఈవీఎంల భద్రత, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ



తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేందుకు ఇటువంటి తనిఖీలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి యం.వెంకటే శ్వరరావు, ఎన్నికల విభాగపు అధికారులు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Allu Venkataramana printed at Karthikeya printing press D.No.12-4-128, Fish Market Road, Kasibugga, Palasa mandal, Srikakulam - 532222, A.P. Published at: D.No.12-4-128, Fish Market Road, Kasibugga, Palasa Mandal, Srikakulam -532222, A.P.
APTEL 2022/82187 Editor : Allu Venkataramana, E-mail : dishadailyevening@gmail.com, Cell: 9039903932, 9039903942